




మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

నేడు గవరపాలెం గౌరమ్మ జాతర

- పూలు, విద్యుత్ దీపాలతో ఆలయం అలంకరణ
- వీధుల్లో భారీ విద్యుత్ సెట్టింగులు



గవరపాలెం గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనున్నది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. సతకంపట్టులోని అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు వీధుల్లో భారీ విద్యుత్ సెట్టింగులు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభం అవుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు తెలిపారు. రాత్రికి పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ...వివరాలు 7వ పేజీలో



విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఆలయం

వ్యవసాయానికి పెద్దపీట

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- 2,65,778 మందికి రైతు భరోసా-పీఎం కిసాన్ సాయం
- మహిళల ఆర్థిక ప్రగతికి కృషి
- 2,97,827 కుటుంబాలకు ఉపాధి హామీ పథకం పనులు
- ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో వైద్య సేవలు మరింత చేరువ
- 2,62,845 ఇళ్లకు 'జల్ జీవన్ మిషన్' కొళాయిలు
- పలు శాఖలు శకటాల ప్రదర్శన, రెవెన్యూ శాఖకు ప్రథమ బహుమతి
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు



జాతీయ జెండా రంగులతో నీటిని చిమ్ముతున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి (ఆంధ్రజ్యోతి)/ అనకాపల్లి టౌన్/ తుమ్మపాల, జనవరి 26:
జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని, భారత రాజ్యాంగానికి లోబడి కుల, మత, వర్ణ, వర్గ విభేదాలు లేకుండా సంక్షేమం, అభివృద్ధి జరుగుతున్నాయని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జరిగిన 75వ గణతంత్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం ద్వారా 2,65,778 మంది రైతులకు రూ.304.43 కోట్ల పెట్టుబడి సహాయం అందించామని తెలిపారు. రాయితీపై విత్తనాలు అందిస్తున్నామని, వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన, పశుసంవర్థక, మత్స్యశాఖల్లో ఆశించిన ప్రగతి సాధించామని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా నాలుగు విడతల్లో 31,910 సంఘాలకు రూ.997.19 కోట్లు రుణ మాఫీ చేశామని, సన్నా వడ్డీ రాయితీ, జగనన్న తోడు, చేయూత పథకాల ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి కృషి జరుగుతున్నదన్నారు. జిల్లాలో 2,67,661 మందికి నెలకు రూ.3 వేల చొప్పున భరోసా పింఛన్‌లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2,97,827 కుటుంబాలకు 107.73 లక్షల పనిదినాలు కల్పించి రూ.287.11 కోట్లు వేతనాలు చెల్లించామన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 200 పంచాయతీలను శుభ్రత గ్రామాలుగా ప్రకటించామన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా అన్ని వర్గాల విద్యార్థులకు రూ.97.6 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 13,259 మందికి రూ.50.99 కోట్లు పంపిణీ చేశామన్నారు. కాపునేస్తం పథకం కింద 18,122 మందికి రూ.100.69 కోట్ల సాయం అందించామని ఆయన పేర్కొన్నారు.



ప్రథమ బహుమతికి ఎంపికైన రెవెన్యూ శాఖ శకటం

జిల్లాలో 'మన బడి నాడు-నేడు' కార్యక్రమం కింద రెండో దశలో ఇప్పటి వరకు రూ.256 కోట్లతో 606 ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు. విద్యా కానుక పథకం ద్వారా 1.23 లక్షల కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశామని, 8వ తరగతి చదువుతున్న 34,969 మంది విద్యార్థులకు రూ.20.65 కోట్లు విలువ చేసే ట్యాబ్‌లను అందించినట్టు చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలను ప్రజలకు దగ్గర చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 25,117 మంది రోగులకు రూ.57.21 కోట్ల విలువైన వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో ఇంతవరకు 2,62,845 ఇళ్లకు కొళాయిలు అమర్చి రక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని, జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రూ.501.39 కోట్లు ఖర్చు చేశామన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు వెలిబుచ్చిన సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కోసం రూ.89.53 కోట్ల ఖర్చు చేశామన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్, ఎస్పీ, జేసీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ బీశెట్టి వరహా సత్యవతి, అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు, ఏఎస్పీలు విజయభాస్కర్, అధిరాజ్‌సింగ్ రాణా (నర్సీపట్నం), సత్యనారాయణ, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెవెన్యూ శకటానికి ప్రథమ బహుమతి

రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాలను ప్రదర్శించారు. నూకాంబిక అమ్మవారి శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్, ఎస్పీ, తదితరులు అమ్మవారి శకటం వద్దకు వెళ్లి పూజలు చేశారు. రెవెన్యూ శాఖ ప్రదర్శించిన ఎన్నికల నిర్వహణ-ఏర్పాట్లు శకటం ప్రథమ బహుమతికి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ... మిగతా 8వ పేజీలో

ఆత్మలకూ ఓట్లు!

తుది ఓటరు జాబితాల్లో చనిపోయిన వారి పేర్లు


- చోడవరం నియోజకవర్గంలో నివాసం... నర్సీపట్నంలో ఓటు
- పదిహేనేళ్ల క్రితం సొంతూరు వెళ్లిపోయిన వ్యక్తి పేరును ఇప్పటికీ తొలగించని వైనం
- తుది జాబితాలో కూడా కొనసాగిన డబుల్ ఎంట్రీలు
- బీఎల్‌వోల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు



చనిపోయినప్పటికీ ఓటరు జాబితాల్లో పేర్లు వున్న వేచలపు అప్పలనాయుడు, పల్లి గంగరాజు, బూడిద రత్నం, మద్దు అప్పారావు

నర్సీపట్నం, జనవరి 26:
త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల అధికారులు విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో ఎడాపెడా తప్పులు కనిపిస్తున్నాయి. గత ఏడాది అక్టోబరులో ముసాయిదా ఓటరు జాబితాలను విడుదల చేసిన తరువాత వాటిల్లో చనిపోయిన వారి పేర్లు, ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు వుండడం, పేర్లు/ చిరునామాల్లో తప్పులు వున్నట్టు రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఎలక్షన్ కమిషన్‌కి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో తప్పులు సరిదిద్ది స్వచ్ఛమైన ఓటరు జాబితాలను విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు.

అయితే ఈ నెల 22న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలను పరిశీలిస్తే.. పాత తప్పులే పునరావృతం అయ్యాయి. బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడమే ఈ తప్పులకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.



రెండోచోట్ల ఓట్లు వున్న పైల చినబుల్లి

ఓటరు జాబితాల్లో చనిపోయిన వారి పేర్లు

నర్సీపట్నం మునిసిపాలిటీలోని పోలింగ్ కేంద్రం 161, సీరియల్ నంబరు 783లో వేచలపు అప్పలనాయుడు (ఏఈఎక్స్ 1529890) పేరు వుంది. కానీ ఇతను చనిపోయి చాలా కాలమైంది. పోలింగ్ కేంద్రం 161, సీరియల్ నంబరు 846లో మద్దు అప్పారావు (ఏఈఎక్స్ 1530203) పేరు వుంది. ఇతను రెండేళ్ల క్రితం చనిపోయారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ... మిగతా 8వ పేజీలో

జీవీఎంసీ జడ్సీల బదిలీ

- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారంజిల్లాలో మూడేళ్లకుపైబడి ఉన్నవారికి స్థానచలనం

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):
గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో పలువురు జోనల్ కమిషనర్లకు బదిలీ అయ్యింది. జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వైశ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జీవీఎంసీలో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్‌గా ఉన్న ఎల్.రామలక్ష్మిని బొబ్బిలి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేసి, అక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. అలాగే భీమిలి (జోన్-1) జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును మండపేట మునిసిపల్ కమిషనర్‌గా, పెందుర్తి (జోన్-8) జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడును విజయనగరం కమిషనర్‌గా బదిలీ చేశారు. మల్లయ్యనాయుడు స్థానంలో విజయనగరం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న పీవీవీడీ ప్రసాదరావును నియమించారు. అలాగే జీవీఎంసీలో మరో డిప్యూటీ ప్రాజెక్టు అధికారిణి ఎ.చంద్రికను రాజమండ్రి పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శిగా ... మిగతా 8వ పేజీలో

ప్రయాణికులకు తిప్పలే

నేడు సగం ఆర్టీసీ బస్సులు వైసీపీ సభకు...

- సంగివలసలో ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సు
- ఒక్కో నియోజకవర్గం నుంచి పది వేల మందిని తరలించాలని నేతలకు అధిష్ఠానం టార్గెట్లు
- ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు బలవంతంగా సేకరణ



నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం/ అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ పాడేరు రూరల్-ఆంధ్రజ్యోతి)
వైసీపీ శనివారం భీమిలి నియోజకవర్గంలోని సంగివలస నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు నియోజకవర్గానికి పది వేల మందిని తీసుకురావాలని ఎమ్మెల్యేలకు/ సమన్వయ కర్తలకు అధిష్ఠానం టార్గెట్లు విధించింది. ఇందుకోసం భారీగా ఆర్టీసీ బస్సులు తీసుకుంటోంది. విశాఖపట్నం రీజియన్‌లో మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, స్టీల్ సిటీ డిపోలు ఉండగా మొత్తం 804 బస్సులు సిటీతో పాటు వివిధ రూట్లలో నడుస్తున్నాయి. వాటిలో 325 బస్సులను శనివారం సంగివలస సభ కోసం తీసుకున్నారు. అంటే సుమారు సగం బస్సులు శనివారం ప్రజలకు అందుబాటులో ఉండవు.

అనకాపల్లి డిపో నుంచి 45 బస్సులు...

అనకాపల్లి టౌన్, జనవరి 26: భీమిలి మండలం సంగివలసలో శనివారం జరిగే వైసీపీ బహిరంగ సభకు జనాలను తరలించడానికి అనకాపల్లి డిపో నుంచి 45 బస్సులను కేటాయించినట్టు అధికారులు పేర్కొన్నారు. డిపోలో మొత్తం 107 బస్సులు వుండగా వీటిల్లో 45 బస్సులను చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు పంపినట్టు తెలిసింది. దీనిపై పీటీడీ అధికారులను వివరణ కోరగా, విశాఖ రీజియన్ మేనేజర్ ఆదేశాల మేరకు 45 బస్సులను శనివారం తెల్లవారుజామున వారు సూచించిన ప్రదేశాలకు పంపనున్నట్టు చెప్పారు. ఆయా బస్సులు తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు డిపోకు చేరుకుంటాయని వెల్లడించారు.

నర్సీపట్నం నుంచి 60 బస్సులు..

నర్సీపట్నం, జనవరి 26: భీమిలి మండలం సంగివలసలో జరిగే వైసీపీ బహిరంగ సభకు జనాన్ని తరలించడానికి నర్సీపట్నం పీటీడీ డిపో నుంచి 60 బస్సులు కేటాయించారు. డిపోలో పీటీడీ బస్సులు 77, అద్దె బస్సులు 27.. మొత్తం 104 బస్సులు ... మిగతా 7వ పేజీలో

నేడు సీఎం జగన్ రాక



విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 2.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మూడు గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి 3.05 గంటలకు హెలీకాప్టర్‌లో భీమిలి నియోజకవర్గ పరిధిలోని తగరపువలస సమీపానున్న సంగివలస వెళతారు. 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకూ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ సభలో పాల్గొంటారు. తిరిగి 5.10 గంటలకు హెలీకాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 5.35 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

గణతంత్ర వేడుకల్లో అలరించిన ప్రదర్శనలు

ఉత్తమ సేవలు అందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం


అనకాపల్లిలో జాతీయ పతాకంతో నృత్యం చేస్తున్న బాలికలు


పోలీసు నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అనకాపల్లి కలెక్టర్, ఎస్పీ, అధికారులు


అనకాపల్లిలో ద్వితీయ బహుమతి సాధించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శకటం



పాడేరు వేడుకల్లో ప్రదర్శిస్తున్న విద్యా శాఖ శకటం


పాడేరులో బీవీకే బాలికల దేశభక్తి ప్రదర్శన


గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అనకాపల్లి జిల్లా అధికారులు


అనకాపల్లిలో తృతీయ బహుమతి సాధించిన విద్యా శాఖ శకటం



అనకాపల్లి వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ప్రదర్శన


అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న (ఎడమ నుంచి కుడివైపునకు) జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డ్వామా పీడీ సందీప్, డీపీవో ఆర్.శిరీషారాణి, డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, డీఏహెచ్‌వో డాక్టర్ బి.ప్రసాదరావు, డీఎస్‌డీవో టి.చాముండేశ్వరరావు, పీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాసు

క్రైం... crime news

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన మహేంద్ర

గూడెంకొత్తవీధి, జనవరి 26: మండలంలోని మొండిగెడ్డ గ్రామ పంచాయతీలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొండెముల మహేంద్ర (22) శుక్రవారం ఉదయం స్నానం కోసం నీటిని వేడి చేసేందుకు బకెట్ నిండుగానున్న నీళ్ల వద్ద వాటర్ హీటర్ పెట్టుకున్నాడు. స్విచ్ ఆన్ చేసినప్పటికీ నీరు వేడి కావడంలేదని హీటర్ షాకెట్ వద్ద ఒత్తగా, ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో మహేంద్ర నిమిషాల వ్యవధిలోనే కింద పడిపోయి మృతి చెందాడు. అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్ ఢీకొని బాలుడి మృతి

పెదబయలు, జనవరి 26: ద్విచక్ర వాహనం ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పెదబయలు మండలంలోని బొండపల్లి పంచాయతీ తొట్టోడిపుట్టు గ్రామానికి చెందిన తల్లాబు నవీన్ కుమార్ (5) ఒకటో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల తరగతులు ముగిసిన తరువాత ఇంటికి చేరుకున్నాడు సాయంత్రం 5.30 గంటల సమయంలో గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన పిల్లలతో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో గోమంగి పంచాయతీ కేంద్రానికి చెందిన కుంబిడి మహేష్, అతని తండ్రి కుంబిడి వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వస్తూ బాలుడ్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలుడు మృతదేహంపై పడి కుటుంబీకులకు భోరున విలపించారు. ప్రమాద ఘటన సమాచారం తెలియగానే పోలీసులకు గ్రామానికి చేరుకొని శుక్రవారం మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

» జోన్‌లో 14 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):
ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లకు పైబడి ఒకే జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లను శుక్రవారం బదిలీ చేశారు. విశాఖపట్నం జోన్ (ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు) పరిధిలో 14 మందికి బదిలీలు అయ్యాయి. విశాఖ డిపో-2 పరిధిలో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఐఏ బేగమ్‌ను విజయనగరం జిల్లా నెల్లిమర్ల డిపో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అనకాపల్లి డిపోలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును శ్రీకాకుళం డిస్టిలరీ వింగ్‌కు బదిలీ చేశారు. డిపో-2 పరిధిలోని జెర్రిపోతులపాలెంలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.మురళీధర్‌ను పార్వతీపురం మన్యం జిల్లాకు రిటైల్ మానిటరింగ్ అధికారిగా, అనకాపల్లి జిల్లాలో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎం.ఇందుమతిని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా, విశాఖపట్నం డిపో-1 పరిధిలోని వెల్లంకిలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా, నెల్లిమర్ల రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావును విశాఖపట్నం-2 డిపో ఎక్సైజ్ సేల్స్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా ఆఫీస్‌లో పనిచేస్తున్న సీహెచ్ చక్రవర్తిని విశాఖపట్నం రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా, శ్రీకాకుళంలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.సూర్యకుమారిని అనకాపల్లి రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్ పనిచేస్తున్న ఎస్‌వీ రమణమూర్తిని విశాఖపట్నం డిస్టిలరీ వింగ్‌కు, విజిలెన్స్ వింగ్‌లో పనిచేస్తున్న కేవైఎస్‌బీఆర్ కుమార్‌ను విశాఖపట్నం, విజయనగరం డిస్టిలరీ వింగ్‌కు, సంకిలి షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పిన్నింటి శ్రీనివాసరావును విశాఖపట్నం-1 డిపో పరిధిలో రిటైల్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కోటపాడులోని పీఎంకే డిస్టిలరీస్‌లో పనిచేస్తున్న డి.శేషకుమారిని అనకాపల్లి డిపోకు, ఇచ్ఛాపురం సమీపాన పురుషోత్తపురం చెక్ పోస్టులో పనిచేస్తున్న కె.లక్ష్మిని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డిపోకు, చిత్తూరు జిల్లా ఎంపీ డిస్టిలరీస్‌లో పనిచేస్తున్న కె.సునీతను శ్రీకాకుళం, విజయనగరం జిల్లా డిస్టిలరీ వింగ్‌కు బదిలీ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

నేడు గవరపాలెం గౌరమ్మ జాతర

» ఏర్పాట్లు పూర్తి
» వీధివీధిన విద్యుత్ దీపాల అలంకరణలు
» భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు


గవరపాలెం గౌరీ పరమేశ్వరులు


అమ్మవారి గుడి వద్ద గౌరీ పరమేశ్వరుల విద్యుత్ సెట్టింగ్, రింగురోడ్డులో విద్యుత్ సెట్టింగ్

అనకాపల్లి టౌన్, జనవరి 26 : ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేకువజామున గౌరీ పరమేశ్వరులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. జాతరలో భాగంగా గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు అధికార, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు తెలిపారు. అలాగే ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా క్యూలైన్‌లను ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా సతకంపట్టులోని అమ్మవారి ఆలయాన్ని పూల, విద్యుత్ అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. వీధి వీధిన భారీ ఎత్తున విద్యుత్ అలంకరణలు చేపట్టారు. చినవాలుగు రోడ్ల జంక్షన్ నుంచి వన్ వే జంక్షన్, రింగు రోడ్డు, బాలకృష్ణ బస్టాప్, గవరపాలెంలోని ప్రధాన జంక్షన్‌ల్లో భారీ ఎత్తున కోల్‌కత్తా వారి ట్రిక్ విద్యుత్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులచే నేలవేషాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయంలో సంతోషిమాత ఆలయ ముఖద్వారం వద్ద భారీ ఎత్తున బాణసంచా వెలిగించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కేఎస్ అప్పారావునాయుడు తెలిపారు. ఇదిలా ఉండగా వ్యాపారం, ఉద్యోగాల రీత్యా దూర ప్రాంతాల్లోని గవరపాలెం వాసులు గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి సొంతిళ్లకు చేరుకున్నారు. ఈ జాతరకు విశాఖ, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఖరగ్‌పూర్, భిలాయి, టాటా ప్రాంతాల్లో ఉన్న వారు కూడా వారి బంధువుల ఇళ్లకు వస్తున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీస్ పికెట్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు సీఐ శంకరరావు తెలిపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

» పరవాడ స్టేషన్‌లో పనిచేస్తున్న సన్యాసిదొర
» స్వగ్రామం పెదబయలు మండలం మండిబ వెళ్లి వస్తుండగా మాడుగుల ఘాట్ రోడ్డుకు చేరేసరికి ఛాతీనొప్పి
» ఆస్పత్రిలో చేరిక.. కాసేపటికే కన్నుమూత


సన్యాసిదొర (ఫైల్)

మాడుగుల, జనవరి 26: పరవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అల్లూరి సీతారామురాజు జిల్లా పెదబయలు మండలం మండిబ (లువ్వాసింగి) గ్రామానికి చెందిన కె.సన్యాసిదొర (39) పరవాడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. స్వగ్రామం లువ్వాసింగికి సెలవుపై వెళ్లిన ఆయన, తిరిగి విధుల్లో చేరేందుకు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకునేసరికి ఛాతీనొప్పి రావడంతో మాడుగుల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సహాయంతో ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. డాక్టర్ శ్రీలక్ష్మి వైద్య సేవలు అందించారు. కొంతసేపు కోలుకున్నప్పటికీ ఉన్నపళంగా ఒక్కసారిగా సన్యాసిదొర కుప్పకూలిపోయారు. దీంతో ఎస్ఐ దామోదరనాయుడు సిబ్బందితో కలిసి ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అంతకుముందు పరవాడ సీఐ ఆస్పత్రికి చేరుకుని మృతుని బంధువులను పరామర్శించారు.

నేత్ర పర్వంగా శ్రీనివాసుని కల్యాణం


శ్రీనివాసుని కల్యాణం జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 26: పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. శుక్రవారం ఉదయం వేదపండితులు విశ్వక్షేణ పూజతో ప్రారంభించారు. అనంతరం, శ్రీరామ రక్ష స్తోత్రం, లక్ష్మీసహిత విష్ణు సహస్రనామ స్తోత్రం తదుపరి పద్మావతి సహిత శ్రీనివాసుని కల్యాణాన్ని నిర్వహించారు. ఈకల్యాణంలో 400 జంటలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి. అనంతరం అన్న సమారాధన జరిగింది. వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, రాష్ట్ర గవర కార్పొరేషన్ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సరిసా శ్రీనివాసరావుతో పాటు భక్తులు భారీ స్థాయిలో పాల్గొన్నారు. కల్యాణానికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

అనకాపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో చక్కని ప్రతిభను కనబరిచిన అధికారులకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. జిల్లాలోని 632 మందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందించారు.

జిల్లా అధికారులు: బి. దయానిధి (డీఆర్వో), ఏజీ చిన్నికృష్ణ (ఆర్డీవో), జి. రామారావు (గణంకాల వివరాలు అధికారి), డాక్టర్ ఎ.హేమంత్ (డీఎంహెచ్‌వో), ఈ.సందీప్ (పీడీ, డ్వామా), సీహెచ్. ఎస్ఆర్ఎస్‌వీ రమేష్ (ఈఈ, ఆర్అండ్‌బి), ఎస్. గోపాలరాజా (జిల్లా సర్వేయర్), ఆర్.శిరీషారాణి (డీపీవో), వీఎల్ సుభాషిణి (జిల్లా ఖజానాధికారిణి), జి.లక్ష్మణ్ (డీఎఫ్‌వో), కె.రమామణి (ఎస్‌డీసీ), ఎస్.మంజులావాణి (జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారిణి), డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు(డీసీహెచ్‌ఎస్), కె.శచీదేవి (పీడీ డీఆర్‌డీఏ), జీవీబీ జగదీష్ (ఏడీ,డబ్ల్యూడీఏటీజీఎస్‌సీ), బి.మోహనరావు (జిల్లా వ్యవసాయాధికారి), డాక్టర్ బి.ప్రసాదరావు (డీఏహెచ్‌వో), పీఎస్ఎల్ కిరణ్‌కుమారి(డీసీవో), బి.రవికిరణ్ (డీఏటీఎంఓ), ఇ.నాగలక్ష్మి (డీటీ కో-ఆర్డినేటర్),ఎం.వెంకటలక్ష్మమ్మ (డీఈవో), ఎస్‌వీ రమణ (డీపీఅండ్‌ఈవో), ఆర్‌వీ రమణ (డీడీఆర్ అండ్ ఎఫ్‌వో), పి. ప్రసాద్ (డీడీ మత్స్యశాఖ), జి. ప్రభాకర్‌రావు (ఉద్యానవనశాఖ), కె.ఇంద్రావతి (డీఐపీఆర్‌వో), జీఎం శ్రీధర్ (జీఎం డీఐసీ), కె.సత్యనారాయణ (ఎల్‌డీఎం), చాముండేశ్వరరావు (డీఎస్‌డీవో), సబ్బవరపు త్రినాథరామ కాసు (వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడు)

కలెక్టరేట్ : ఎ. శ్రీనివాసరావు (సూపరింటెండెంట్), ఎంఏ శ్రీనివాస్ (సూపరింటెండెంట్), వైఎస్‌వీవీ ప్రసాదరావు (ఓఎస్‌డీ, రీసర్వే), సీహెచ్. చంద్రశేఖర్ (సూపరింటెండెంట్, స్పందన), ఆర్.నరసింహమూర్తి (సూపరింటెండెంట్, ల్యాండ్స్), పి.లక్ష్మీదేవి (సూపరింటెండెంట్, కో-ఆర్డినేషన్)

తహసీల్దార్లు, డీటీలు : వీవీఎల్ఎస్ గంగాధరరావు (అనకాపల్లి), బి. సత్యనారాయణరావు (సబ్బవరం)

పోలీస్ శాఖ : అదిరాజ్‌సింగ్ రాణా (ఏఎస్పీ, నర్సీపట్నం), వి.సుబ్బరాజు (డీఎస్పీ, అనకాపల్లి), కేవీ సత్యనారాయణ (డీఎస్పీ, పరవాడ), ఎం. మహేశ్వరరావు (డీఎస్పీ, దిశ), పి. శ్రీనివాసరావు (డీఎస్పీ, డీటీసీ), కె.కుమారస్వామి (సీఐ సోషల్‌మీడియా), ఎస్. లక్ష్మణమూర్తి (సీఐ డీసీఆర్‌బీ), పి.అప్పలరాజు (సీఐ, పాయకరావుపేట), ఆర్. నీలయ్య (సీఐ,సీసీఎస్), కె.అప్పలనాయుడు (సీఐ, డీఎస్‌బీ-2), టీవీ రమణ (డీపీఓ కార్యాలయం)

వ్యవసాయ శాఖ : బి.సరోజిని (వ్యవసాయాధికారి, పాయకరావుపేట), ఎం. వాసుదేవరావు (వ్యవసాయాధికారి, నర్సీపట్నం), డీవీ రమణ (సూపరింటెండెంట్, జిల్లా ఆఫీస్), టీవీఆర్ఎల్ నారాయణ (సీనియర్ అసిస్టెంట్, ఎలమంచిలి)

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా): బీవీ శ్రీనివాసకుమార్ (ఏపీడీ, ఎలమంచిలి), జె.మణికుమార్ (ఏపీడీ, అనకాపల్లి)

జిల్లా పౌరసరఫరాల శాఖ : టి. లీలా శేషకుమారి (డీటీ), కె.ఈశ్వరరావు (సీఎస్ఆర్ఐ, మాడుగుల), జి. సాయిబాబు (సీఎస్ఆర్ఐ, కె. కోటపాడు)

కమర్షియల్ ట్యాక్స్: పీవీ శైలజా (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి), ఏ. తరుణ్ (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి), ఎన్. సౌజన్య (గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అధికారి, అనకాపల్లి), జి. సంతోషమ్మ (అసిస్టెంట్ కమిషనర్, అనకాపల్లి).

జిల్లా పరిషత్: కె.అప్పలనాయుడు (ఎంపీడీఓ ఎలమంచిలి), సీహెచ్ సుబ్బలక్ష్మి, (ఎంపీడీఓ, దేవరాపల్లి), బీహెచ్‌వీఆర్ రమణబాబు, (ఎంపీడీఓ, అనకాపల్లి), బి.అమ్మాజీ (ఏఓ చోడవరం), జిల్లా ఖజానా కార్యాలయం నుంచి సాయిఅఖిలేష్, జె.రత్నాలు, పింశకర్, సయ్యద్ సలీమ్, డీవీ రమారెడ్డి (ఏపీఈపీడీసీఎల్)

909 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

అనకాపల్లి టౌన్, జనవరి 26: స్థానిక మిరియాలకాలనీ మూడో వీధిలోని ఒక ఇంటిపై శుక్రవారం దాడి చేసి అనధికారికంగా నిల్వ చేసిన 909 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి యజమాని గాని, సరుకుకు సంబంధించిన వ్యక్తులు గాని ఎవరన్నది తెలియాల్సి ఉందన్నారు. చుట్టుపక్కల వారిని ఎవరిని అడిగినా ఎటువంటి సమాచారం అందడం లేదన్నారు. ఈపీడీసీఎల్, రిజిస్టర్ ఆఫీస్ ద్వారా ఆ ఇంటి వివరాలను తెలుసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విచారణ నిర్వహించి, సరుకు నిల్వ చేసిఇన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రయాణికులకు తిప్పలే

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. పీటీడీకి చెందిన 77 బస్సుల్లో 60 బస్సులు సీఎం సభకు ప్రజలను తరలించడానికి వివిధ నియోజకవర్గాలకు పంపుతున్నారు. విశాఖ, చింతపల్లి, చోడవరం రూట్లలో నడిచే బస్సులన్నింటినీ మళ్లిస్తున్నారు. మిగిలిన 17 పీటీడీ బస్సులు, 27 అద్దె బస్సులు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో వుంటాయి. సాధారణంగా ప్రతీ శనివారం మధ్యాహ్నం తరువాత ఆర్టీసీ బస్సుల్లో రద్దీ వుంటుంది. ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు సొంతూళ్లకు వెళుతుంటారు. ఈసారి వైసీపీ సభకు సగానికిపైగా బస్సులు కేటాయించడంతో ప్రయాణిలకు ఇబ్బందులు తప్పవు. దీనిపై డిపో మేనేజర్ ధీరజ్‌ని వివరణ కోరగా ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూస్తామన్నారు.

పాడేరు డిపో నుంచి సగం బస్సులు

పాడేరు రూరల్: పాడేరు పీటీడీ డిపోలో 45 బస్సులు వుండగా, 22 బస్సులను సీఎం సభకు కేటాయించామని డీపీటీవో వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం సభకు జనాలను తరలించేందుకు ప్రతి మండలానికి రెండు బస్సులు పంపుతున్నట్టు చెప్పారు. అందువల్ల శనివారం పలు రూట్లలో బస్సు సర్వీసులను రద్దు చేశామన్నారు. 5 గంటలకు అరకు, 5.30 గంటలకు గూడెం, మూలకొత్తూరు, జోలాపుట్టు, 6 గంటలకు మంప, అరడగూడెం, 6.15 గంటలకు అరకు, కుమడ, 6.30 గంటలకు చోడవరం, అరకు, 6.45 గంటలకు డుడుమ, పెదగూడ, వేంగడ, 7.15 గంటలకు చింతపల్లి, 7.30 గంటలకు మద్దిగరువు, 7.45 గంటలకు బాకూరు, 8 గంటలకు అరకు, 8.30 గంటలకు చోడవరం, 10.15 గంటలకు జోలాపుట్టు, 11 గంటలకు గూడెం, 12.30 గంటలకు గెమ్మెలి బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రైవేటు బస్సులు కూడా..

సంగివలస సభకు జనం తరలింపునకు వైసీపీ నేతలు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను కూడా బలవంతంగా తీసుకున్నారు. బస్సులు తీసుకున్నామని చెప్పి...విద్యా సంస్థలకు సెలవు ఇచ్చేసి, పార్టీకి చెడ్డపేరు తెస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బస్సులు లేకపోయినా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని, సెలవు మాత్రం ఇవ్వకూడదని స్పష్టంచేశాయి.

నాడు టీడీపీకి మొండిచేయి

గత నెలలో తెలుగుదేశం పార్టీ భోగాపురం మండలం పోలిపల్లిలో 'యువగళం..నవశకం' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఈ సభ కోసం బస్సులు కావాలని ఆర్టీసీ ఎండీకి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు లేఖ రాస్తే, ముందు అంగీకరించి, తరువాత ఇవ్వలేమని చేతులెత్తేశారు. ప్రైవేటు సంస్థల నుంచి సమీకరించుకోవాలని ప్రయత్నిస్తే... ఆయా యాజమాన్యాలను బెదిరించారు. బస్సులు ఇస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో టీడీపీ శ్రేణులు సొంత కార్లు, ఆటోలు, బైకులపై సభకు వెళ్లారు. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే బస్సులు ఇవ్వలేదని నాడు అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పుడు సగం బస్సులను వైసీపీ సభకు ఇవ్వడం ఇబ్బంది కలగవా?..అని తెలుగుదేశం వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

వాడవాడలా గణతంత్ర వేడుకలు


కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న జేసీ జాహ్నవి


జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, అధికారులు


జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు


డీఎస్ఎన్ఎల్‌యూలో జెండాను ఆవిష్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

అనకాపల్లి టౌన్, జనవరి 26: జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో దాడి రత్నాకర్, ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.శంకరరావు, రైల్వేస్టేషన్‌లో సూపరింటెండెంట్ సచి నివాస్, ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, కోర్టు వద్ద పదవ అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీవిద్య పతాకాలను ఆవిష్కరించారు. పీటీడీ డిపోలో డీపీటీవో పద్మావతి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గంగాధరరావు, అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద అగ్నిమాపక అధికారి నరసింగరావు, దిశ పోలీస్‌స్టేషన్ వద్ద డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, చిన్నవీధిలోని జార్జి పాఠశాలలో వాసవీక్లబ్ వనిత అనకాపల్లి శాఖ అధ్యక్షురాలు జంగాల ఫణి జాతీయ జెండాలను ఎగురవేశారు.

కొత్తూరులో..స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు ఎగురవేశారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ క్యాడెట్స్ నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, పాలకవర్గం అధ్యక్షుడు కొల్లూరు ఎస్ఎన్ మంగరాజు, కర్రి సన్యాసినాయుడు, పెంటకోట శ్రీను, సూపరింటెండెంట్ అనురాధ పాల్గొన్నారు.

కశింకోటలో.. మండల కేంద్రంలో తహసీల్దార్ సురేష్‌నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుస్టేషన్‌లో సీఐ కె.వినోద్‌బాబు, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది, మండల ప్రజాపరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ కలగ లక్ష్మి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయంలో ఈవో రమేష్, డీపీఎన్ జడ్పీహైస్కూల్‌లో హెచ్ఎం అప్పారావు పతాకావిష్కరణ చేశారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పతాకాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళీ, కొణతాల రత్నాకుమారి, శంకర్ల పద్మలత, మళ్ల గణేష్ పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నరసింహరావు జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరహా సత్యవతి, ఈవోపీఆర్డీ ధర్మారావు, అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్‌లో.. శంకరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎం. జాహ్నవి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, చాక్లెట్లను ఆమె పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఆర్వో బి. దయానిధి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్‌లో.. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ, అడిషినల్ ఎస్పీ బి. విజయభాస్కర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎస్పీ కేవీ మురళీకృష్ణ పోలీస్ అధికారులకు, సిబ్బందికి గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు.

కోటవురట్లలో.. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కాశీవిశ్వనాథం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సోమశేఖర్, కేజీబీవీలో ఎస్‌వో సరితదేవి, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కొండబాబు, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ రమణయ్య జాతీయ పతాకాలను ఎగురవేశారు.

నక్కపల్లిలో.. తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ అంబేడ్కర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాస్, గురుకులంలో ప్రిన్సిపాల్ కె.సువర్ణ రత్నకుమారి, పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో నరేశ్ త్రివర్ణ పతాకాలను ఎగురవేశారు. రాజయ్యపేట, జానకయ్యపేట, డీఎల్‌పురం, దేవవరం, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, వేంపాడు హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి.

ఎస్.రాయవరంలో.. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ విజయకుమార్, నక్కపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ అప్పన్న జాతీయ పతాకాలను ఎగురవేశారు. నియోజకవర్గ సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలోని నాలుగు మండలాల్లో ఉన్న జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మునగపాకలో.. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధికారులతో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, తహసీల్దార్ వినయ్, ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయ ఇన్‌చార్జి ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్బవరంలో.. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్‌నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ, ఫైర్ స్టేషన్‌లో చీఫ్ ఫైరాఫీసర్ దిలీప్‌కుమార్, ప్రభుత్వ హైస్కూల్లో హెచ్ఎం తిరుపతిరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.


అనకాపల్లి జోనల్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జడ్సీ వెంకటరమణ, కార్పొరేటర్లు


ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


పాయరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ ఇసరపు పార్వతి

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో..

స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉప కులపతి, ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించినప్పుడే దేశం గాని, వ్యవస్థలు గాని అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడలో.. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వి.హేమసుందరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కనకారావు జెండాను ఆవిష్కరించగా, పరవాడ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ బాలసూర్యారావు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో స్థానిక దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హా జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు.

పాయకరావుపేట/రూరల్‌లో.. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సాంబశివరావు, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు కె.జయప్రకాష్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ ఇసరపు పార్వతి, ఎంఈఓ కేవీఎన్.గాంధీ, ఏట వర్మ పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ పి.అప్పలరాజు జాతీయ జెండా ఎగురవేశారు. వైసీపీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక దళిత బహుజన పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీబీపీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బుచ్చిరాజు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు. అలాగే ప్రతి గ్రామ సచివాలయాల వద్ద ఆయాగ్రామాల అధికారులు, నాయకులు పతాకావిష్కరణలు చేశారు.

రాంబిల్లిలో.. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.భాగ్యవతి, పోలీస్ స్టేషన్ వద్ద దీనబంధు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షులు బైలపూడి రామదాసు జాతీయ జండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు లాలం చందు, పప్పల నూకన్నదొర, ఎం.త్రివేణి పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కొండలరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ రమాకుమారి పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు రాణి అమ్మాజీ, జంపపాలెం హైస్కూల్ వద్ద జిల్లా ఉప విద్యా శాఖ అధికారి అప్పారావు, పీఎస్ఆర్‌పేట హైస్కూల్‌లో జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఉపాధ్యాయులు, మాజీ సైనికోద్యోగులు, విద్యార్థులు కలిసి సమరయోధుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.


కోర్టులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తులు


డైట్‌లో జాతీయపతాకానికి వందనం చేస్తున్న రత్నాకర్


ఎలమంచిలిలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ కొండలరావు, చైర్‌పర్సన్ రమాకుమారి


జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న డీఎస్పీ సుబ్బరాజు, దిశ డీఎస్పీ మహేశ్వరరావు, సీఐ లక్ష్మణమూర్తి. చిత్రంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి ఉన్నారు.


అచ్యుతాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పతాకావిష్కరణలో పాల్గొన్న అధికారులు, పాలకులు


నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద రిపబ్లిక్ డే వేడుకలు జరుపుతున్న దృశ్యం

వ్యవసాయానికి పెద్దపీట

... 5వ పేజీ తరువాయి

శకటం ద్వితీయ బహుమతికి, విద్యా శాఖ శకటం తృతీయ బహుమతికి ఎంపికయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, విద్య, వైద్య, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తిలకించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. భారత్ హమ్‌కో పాటకు నృత్య ప్రదర్శన చేసిన పరవాడ మండలం పినమడక ఏబీఎస్ స్కూల్ విద్యార్థులకు ప్రథమ బహుమతి, జయహో గేయానికి నృత్యం చేసిన వడ్డాది కేజీబీవీ బాలికలకు ద్వితీయ బహుమతి, నమో నమో భారతి పాటకు నృత్య ప్రదర్శన చేసిన కశింకోట సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులకు తృతీయ బహుమతి దక్కాయి. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో అగ్నిమాపక శకటం జవాన్‌లు ప్రదర్శనతో అవగాహన కల్పించారు. జాతీయ జెండాలోని త్రివర్ణాలు కనిపించేలా ఆయా రంగులు కలిపిన నీటిని పైపుల ద్వారా గాల్లోకి చిమ్మడం చూపరులను ఆకట్టుకుంది.

ఆత్మలకూ ఓట్లు!

... 5వ పేజీ తరువాయి

ఇంటి సమీపంలో హోటల్ నిర్వహించేవారు. ఇతని పేరు ఓటరు జాబితాలో వుండడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. బలిఘట్టం పరిధిలోని పోలింగ్ కేంద్రం 150, సీరియల్ నంబరు 44లో బూడిద రత్నం (ఏఈఎక్స్ 1292952) పేరు వుంది. ఈమె కూడా చనిపోయింది. పోలింగ్ కేంద్రం 149, సీరియల్ నంబరు 373లో బలిఘట్టానికి చెందిన పల్లి గంగరాజు పేరు వుంది. ఇతను చనిపోయి చాలా రోజులైంది.

చోడవరం నియోజకవర్గం ఓటరు..

నర్సీపట్నం జాబితాలో పేరు

నర్సీపట్నం పోలింగ్ కేంద్రం 161, సీరియల్ నంబరు 544లో గట్టిరెడ్డి త్రినాథ్ పేరు వుంది. ఇతని సొంత ఊరు చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం కొత్తకోట గ్రామం. ఇతను కొత్తకోట మునసబు కుమారుడు. ఎంఈవోగా పని చేసి రిటైర్ అయ్యారు. గతంలో నర్సీపట్నం కళాశాలలో ఉద్యోగం చేసినప్పుడు అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. నర్సీపట్నం నుంచి సొంతూరు వెళ్లిపోయి సుమారు 15 సంవత్సరాలు అవుతున్నది. కానీ నర్సీపట్నం ఓటరు జాబితాలో ఆయన పేరు తొలగించలేదు.

రెండు చోట్ల ఓటు హక్కు

బలిఘట్టం డోర్ నంబరు 17-1-151, పోలింగ్ కేంద్రం 149, సీరియల్ నంబరు 605లో పైల చినబుల్లి (ఏఈఎక్స్ 1024371) పేరు ఉంది. అదే పేరు, అదే ఫొటోతో డోర్ నంబరు 17-2-70/1, పోలింగ్ కేంద్రం 151, సీరియల్ నంబరు 431లో (ఏఈఎక్స్ 1310085)లో కూడా పేరు వుంది. నర్సీపట్నం మునిసిపాలిటీలో ఓటరు జాబితాల్లో వున్న తప్పుల్లో ఇవి కొన్ని మాత్రమే. కాగా తప్పుల తడకలుగా వున్న ఓటరు జాబితాలపై ఎలక్షన్ డీటీ సుధావాణిని వివరణ కోరగా.. ఓటరు జాబితాలను పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే సరిచేస్తామని చెప్పారు.

జీవీఎంసీ జడ్సీల బదిలీ

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేశారు. అనకాపల్లి (జోన్-7) జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణను సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రాజమండ్రి పట్టణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న జిశైలజావల్లిని జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించారు. గాజువాక (జోన్-6) జోనల్ కమిషనర్ పి.సింహాచలాన్ని పార్వతీపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేసి, ఆయన స్థానంలో నెల్లూరు కార్పొరేషన్ కార్యదర్శి కె.హేమవతిని నియమించారు. పాతనగరం ఏరియా (జోన్-4) జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఏలేశ్వరం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పెద్దాపురం మునిసిపల్ కమిషనర్ జె.సురేంద్రను జీవీఎంసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, అమరావతిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న కె.మేరీగోల్డ్ డైమండ్‌ను జోనల్ కమిషనర్‌గా నియమించారు. మధురవాడ (జోన్-2) జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చి, అక్కడ పనిచేసే బంటుమిల్లి సన్యాసినాయుడును ఆమె స్థానంలో నియమించారు. జీవీఎంసీలో ఉద్యానవన విభాగం అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.చక్రవర్తిని మాతృ సంస్థ వ్యవసాయ శాఖకు పంపగా, అమలాపురం కమిషనర్ వీవీపీ నాయుడుకు జీవీఎంసీలో జోనల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


రేవుపోలవరంలో షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం, జనవరి 26: మండలంలోని రేవుపోలవరం షిర్డీ సాయిబాబా ఆలయ 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి సాయిరాం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మందపాటి కృష్ణరాజు, చేపల రాజు, శివ, కోటయ్య, మోహనరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మలునాయుడుపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


ధర్మతేజ


చరణ్

సబ్బవరం, జనవరి 26: మండలంలోని మలునాయుడు పాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థి బొడ్డు చరణ్ ఎన్ఎంఎస్ఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక య్యాడు. ఈ విద్యార్థికి ఇంటర్మీడియట్ వరకూ ఏడాదికి రూ.15 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని హెచ్ఎం సోమునాయుడు తెలిపారు. అదేవిధంగా మరో 8వ తరగతి విద్యార్థి పి.ధర్మతేజ జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. పీడీ రమణమ్మ, విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత టీడీపీదే

▸▸ టీడీపీ నేతలు పప్పల, ప్రగడ, దూళి


దేముడుకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేతలు

రాంబిల్లి, జనవరి 26 : బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత టీడీపీదేనని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన టీడీపీ జయహో బీసీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించి రాజ్యాధికారం ఇచ్చిందన్నారు. నేడు వైసీపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్‌లు తగ్గించి రాజ్యాధికారం లేకుండా చేసిందన్నారు. బీసీలను అన్నివిధాల మోసం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కులగణన పేరుతో బీసీలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం కుయుక్తులు పన్నుతుందని ఆరోపించారు. రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గింజల లక్ష్మణరావు మాట్లాడుతూ బీసీల ప్రగతి తెలుగుదేశంతోనే సాధ్యపడుతుందన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని బీసీలకు మంచి రోజులు రానున్నాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్స్యకార సంఘం అధికార ప్రతినిధిగా నియమితులైన చెల్లూరి దేముడును పార్టీ నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చోడిపల్లి సత్యనారాయణ, వి.దినబాబు, గుర్రం నూకరాజు, పి.రావిరాజు, ఎరిపల్లి చిట్టిబాబు, బత్తుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వీరాభిమాని వడ్డిమెట్టకు పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జనవరి 26 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై సీఐడీ పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు వీగిపోవాలని ఆకాంక్షిస్తూ పట్టణానికి చెందిన టీడీపీ వీరాభిమాని ఉప్పరాపల్లి వీరభద్రరావు శుక్రవారం పాండురంగస్వామి ఆలయం నుంచి నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, తదితరులు సంఘీభావం తెలియజేసి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా విలియంకేరి, మలిపెద్ది వెంకటరమణ, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, ఎం. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమృతపురం తీర్థం

సబ్బవరం, జనవరి 26: మండలంలోని అమృతపురంలో దుర్గమాంబ, ఎల్లుప్పిలో సీతారాముల తీర్థాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే ప్రజలు ఆలయాలను దర్శించుకొని, పూజలు చేశారు. సాయంత్రం చిడతల భజనలు, తప్పెడగుళ్లు, మేళతాళాలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచులు బైలపూడి గౌరీ, ఉగ్గిన దేముడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శింగంపల్లి శ్రీనివాసరావు, బైలపూడి రామారావు, పాపాన ఎల్లాజీ పాల్గొన్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

పరవాడ, జనవరి 26: భరిణికం పంచాయతీ పరిధి కట్టవానిపాలెం శివారుల్లో శుక్రవారం కోడిపందాలు నిర్వహించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో దాడి చేసి, రెండు కోడిపుంజులు, ఐదువేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పందాలు నిర్వహించిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

'మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు

సబ్బవరం, జనవరి 26 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మండలంలోని వంగలిలో శుక్రవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న 18 పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీహేమ, నేతలు ఆకుల గణేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, జనవరి 26 : వచ్చే నెల తొమ్మిది నుంచి 11 తేదీ వరకు విశాఖపట్నం పోర్టు ఇండోర్‌స్టేడియంలో జరిగే నిజి సోటాకాన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీల పోస్టర్‌ను తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక డీవీఆర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కరాటే పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్ ఎస్‌పీఎండీ నాయుడు, శిలపరశెట్టి బాబి, డి.గోవింద యాదవ్, ఎస్.కిరణ్‌కుమార్, జీసీహెచ్ మూర్తి, పి.ఈశ్వరరావు, కె.సాయి, ఎం.ప్రణీత్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

▸▸ సీఐటీయూ, రైతు సంఘం ర్యాలీ, నిరసన


బైక్ ర్యాలీని ప్రారంభించిన నాయనబాబు

అనకాపల్లి టౌన్, జనవరి 26 : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కోరుతూ సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు శుక్రవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. సీఐటీయూ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని జిల్లా రైతు సంఘం కోశాధికారి గండి నాయనబాబు జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ వీధుల గుండా నిరసన ర్యాలీ చేశారు. అనంతరం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, ప్రధానకార్యదర్శి ఎం.అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, నాయకులు గణేష్, గాడి బాలు, ఆర్. దొరబాబు,జి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

నక్కపల్లి,జనవరి 26: నక్కపల్లిలో శుక్రవారం జనసేన పార్టీ మండల కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ప్రారంభించారు. నాలుగు మండలాల నుంచి జనసేన నాయకులు,కార్యకర్తలు తరలివచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాము గణేశ్, బాబూరావు, ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, సుధాకర్, పులి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎస్ఐగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం

కశింకోట, జనవరి 26 : స్థానిక పోలీసుస్టేషన్ ఎస్ఐగా రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం నుంచి కశింకోటకు బదిలీపై వచ్చారు. సీఐ కె.వినోద్‌బాబు ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఔ

'రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం'


భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు అందజేస్తున్న బాబర్

కశింకోట, జనవరి 26 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే.బాబర్ అన్నారు. శుక్రవారం బయ్యవరంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేస్తాన్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం మహిళలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గలసాల శ్రీను పాల్గొన్నారు.

ఓటమి భయంలో జగన్‌రెడ్డి : పీలా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 26 : రానున్న ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నారని మాజీఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో వైసీపీ ఖాళీ అయిపోవడం ఖాయమన్నారు. విద్యా వ్యవస్థను అనాలోచిత నిర్ణయాలతో పాడు చేశారని ఆరోపించారు. విద్యార్థులకు అందించే ట్యాబ్‌ల పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని వైసీపీ నాయకులు దోచుకున్నారన్నారు. టీడీపీ హయాంలో దేశంలో రాష్ట్రం విద్యావ్యవస్థ ఎనిమిదవ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం 19వ స్థానానికి పడిపోయిందన్నారు. రాష్ట్రం గాడిలో పడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చికూర రాము, తలారి కాశీనాయుడు, సింగంపల్లి ప్రసాద్, మళ్ల బాబు, కాండ్రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కులమ్మ పేరంటాల తీర్థం

పరవాడ, జనవరి 26 : స్థానిక సిరపురపు వారి కుటుంబీకుల ఆరాధ్య దైవం అక్కులమ్మ పేరంటాల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పేరంటాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు,జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు పేరంటాలని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను నిర్వహించారు.

ఎట్టకేలకు డ్రైనేజీ కాలువలకు మోక్షం

మునగపాక, జనవరి 26 : మండలంలోని గంగాదేవిపేటలో శుక్రవారం డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ జరిగింది. గ్రామంలో సమస్య తీవ్రతను గుర్తించిన పంచాయతీ కార్యవర్గం డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని తీర్మానించింది. దీంతో మజ్జివీధిలో డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవి పనులు ప్రారంభించారు. డ్రైనేజీ పనులు మొదలు పెట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

30 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

ఎలమంచిలి, జనవరి 26: ప్రతిభ కనబరచిన పేద విద్యార్థినులకు దేవదాయ శాఖ సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. శుక్రవారం ఒక కల్యాణ మండపం ఆవరణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలమంచిలి లోకల్‌ఫండ్ సత్రం నిధులతో 30 మంది విద్యార్థినులకు ఈ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ సాంబశివరావు, మునిసిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల కొండబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదు మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జనవరి 26 : మండలంలోని తానాం శివారులో గల ఒక పాన్‌షాపులో మద్యం అమ్మకాలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఎస్ఐ తేజేశ్వరరావు సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఐదు మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని ఎన్. ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

ప్రజలు తరిమి కొడతారనే జగన్ కథలు

» ఓటమి భయంతో మారిన సీఎం స్వరం

» ఐదేళ్లలో రాష్ట్రం అప్పులమయం : టీడీపీ నాయకుడు 'బత్తుల'


సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 26 : తన దిక్కుమాలిన పాలనపై ప్రజల్లో వస్తున్న తిరుగుబాటును ముందుగా ఊహించిన సీఎం జగన్ తప్పుకుంటానని కథలు చెబుతున్నారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండలంలోని వడ్డాది పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ '2021లో నా వెంట్రుక కూడా పీకలేరు... అని, 2022లో నన్నే నమ్మండి.. అని, 2023లో మిమ్మల్నే నమ్ముకున్నానని.. వాఖ్యానించగా, 2024లో మాత్రం హ్యాపీగా దిగిపోతాను'అని అంటున్నారంటే ప్రజలు తరమికొడతారనే భయం ఆయనను వెంటాడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఐదేళ్లుగా ప్రజల్ని, ప్రజా వనరుల్ని దోచుకుని సుమారు రూ.నాలుగు లక్షల కోట్లను దాచుకోవడానికే హ్యాపీగా దిగిపోతానని జగన్ అంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే సుమారు రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఒక్కఛాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశం చేశారన్నారు. జగన్‌ను గద్దె దించడం ద్వారా రాష్ట్రాన్ని బాగుచేసుకోవాలని ప్రజలంతా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని తాతయ్యబాబు అన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపుతోనే రాష్ట్ర పురోభివృద్ధి'

బుచ్చెయ్యపేట, జనవరి 26 : టీడీపీ గెలుపుతోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని భైరా ఫౌండేషన్ అధినేత దిలీప్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని రాజాంలో టీడీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క ఛాన్సు అని అధికారంలోకి వచ్చిన జగన్ ఆంధ్రాను అన్నరంగాల్లో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. విజన్ కలిగిన నాయకుడైన చంద్రబాబు గెలుపు చారిత్రక అవసరమన్నారు. అనంతరం ఎర్రవాయి ప్రాంత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు నాగులాపల్లి సత్యనారాయణ, వెలంకాయల అప్పలనాయుడు, ఎం.బాబ్జి, కె.సత్యనారాయణ, జి.రాజారావు, నక్కా శేష తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మారిన బీఎన్ రోడ్డు

» చిన్నపాటి వర్షానికే మడుగును తలపిస్తుండడంతో అవస్థలు


గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి బీఎన్ రోడ్డు దుస్థితి

రోలుగుంట, జనవరి 26 : మండలంలోని బీఎన్ రోడ్డు అధ్వానంగా మారింది. గత నాలుగున్నరేళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బీఎన్ రోడ్డులోని గోతుల్లో నీరు చేరడంతో మడుగులున్నా మారాయి. ఇటువంటి సమయంలో రాకపోకలు కష్టంగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇదిలావుంటే, రెండు మూడుసార్లు అధికారులు మట్టితో గోతులను పూడ్చినప్పటికీ మూణ్నాళ్లకే పరిస్థితి మొదటికి వస్తున్నట్టు చెపుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

... 5వ పేజీ తరువాయి

శకటం ద్వితీయ బహుమతికి, విద్యా శాఖ శకటం తృతీయ బహుమతికి ఎంపికయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, విద్య, వైద్య, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తిలకించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. భారత్ హమ్‌కో పాటకు నృత్య ప్రదర్శన చేసిన పరవాడ మండలం వీనమడక ఏబీఎస్ స్కూల్ విద్యార్థులకు ప్రథమ బహుమతి, జయహో గేయానికి నృత్యం చేసిన వడ్డాది కేజీబీవీ బాలికలకు ద్వితీయ బహుమతి, నమో నమో భారతి పాటకు నృత్య ప్రదర్శన చేసిన కశింకోట సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థులకు తృతీయ బహుమతి దక్కాయి. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో అగ్నిమాపక శకటం జవాన్‌లు ప్రదర్శనతో అవగాహన కల్పించారు. జాతీయ జెండాలోని త్రివర్ణాలు కనిపించేలా ఆయా రంగులు కలిపిన నీటిని పైపుల ద్వారా గాల్లోకి చిమ్మడం చూపరులను ఆకట్టుకుంది.

ఆత్మలకూ ఓట్లు!

... 5వ పేజీ తరువాయి

ఇంటి సమీపంలో హోటల్ నిర్వహించేవారు. ఇతని పేరు ఓటరు జాబితాలో వుండడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. బలిఘట్టం పరిధిలోని పోలింగ్ కేంద్రం 150, సీరియల్ నంబరు 44లో బూడిద రత్నం (ఏతఎక్స్ 1292952) పేరు వుంది. ఈమె కూడా చనిపోయింది. పోలింగ్ కేంద్రం 149, సీరియల్ నంబరు 373లో బలిఘట్టానికి చెందిన పల్లి గంగరాజు పేరు వుంది. ఇతను చనిపోయి చాలా రోజులైంది.

చోడవరం నియోజకవర్గం ఓటరు..

నర్సీపట్నం జాబితాలో పేరు

నర్సీపట్నం పోలింగ్ కేంద్రం 161, సీరియల్ నంబరు 544లో గట్టిరెడ్డి త్రినాథ్ పేరు వుంది. ఇతని సొంత ఊరు చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం కొత్తకోట గ్రామం. ఇతను కొత్తకోట మునసబు కుమారుడు. ఎంఈవోగా పని చేసి రిటైర్ అయ్యారు. గతంలో నర్సీపట్నం కళాశాలలో ఉద్యోగం చేసినప్పుడు అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. నర్సీపట్నం నుంచి సొంతూరు వెళ్లిపోయి సుమారు 15 సంవత్సరాలు అవుతున్నది. కానీ నర్సీపట్నం ఓటరు జాబితాలో ఆయన పేరు తొలగించ లేదు.

రెండు చోట్ల ఓటు హక్కు

బలిఘట్టం డోర్ నంబరు 17-1-151, పోలింగ్ కేంద్రం 149, సీరియల్ నంబరు 605లో పైల చినబుల్లి (ఏతఎక్స్ 1024371) పేరు ఉంది. అదే పేరు, అదే ఫొటోతో డోర్ నంబరు 17-2-70/1, పోలింగ్ కేంద్రం 151, సీరియల్ నంబరు 431లో (ఏతఎక్స్ 1310085)లో కూడా పేరు వుంది. నర్సీపట్నం మునిసిపాలిటీలో ఓటరు జాబితాల్లో వున్న తప్పుల్లో ఇవి కొన్ని మాత్రమే. కాగా తప్పుల తడకలుగా వున్న ఓటరు జాబితాలపై ఎలక్షన్ డీటీ సుధావాణిని వివరణ కోరగా.. ఓటరు జాబితాలను పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే సరిచేస్తామని చెప్పారు.

జీవీఎంసీ జడ్సీల బదిలీ

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేశారు. అనకాపల్లి (జోన్-7) జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణను సాలూరు మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రాజమండ్రి పట్టణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న జి.శైలజావల్లిని జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గా నియమించారు. గాజువాక (జోన్-6) జోనల్ కమిషనర్ పి.సింహాచలాన్ని పార్వతీపురం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేసి, ఆయన స్థానంలో నెల్లూరు కార్పొరేషన్ కార్యదర్శి కె.హేమవతిని నియమించారు. పాతనగరం ఏరియా (జోన్-4) జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఏలేశ్వరం మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పెద్దాపురం మునిసిపల్ కమిషనర్ జె.సురేంద్రను జీవీఎంసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, అమరావతిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న కె.మేరీగోల్డ్ డైమండ్‌ను జోనల్ కమిషనర్‌గా నియమించారు. మధురవాడ (జోన్-2) జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చి, అక్కడ పనిచేసే బంటుమిల్లి సన్యాసినాయుడును ఆమె స్థానంలో నియమించారు. జీవీఎంసీలో ఉద్యానవన విభాగం అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.చక్రవర్తిని మాతృ సంస్థ వ్యవసాయ శాఖకు పంపగా, అమలాపురం కమిషనర్ వీవీపీ నాయుడుకు జీవీఎంసీలో జోనల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.


నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జెండా వందనం


కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌లో...


రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో...

ఘనంగా గణతంత్ర దినోత్సవం

» ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు

» నాతవరంలో 75 అడుగుల పతాకంతో భారీ ర్యాలీ



నాతవరంలో 75 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరిస్తున్న విద్యార్థులు


దేవరాపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారిణి మేఘన జెండా వందనం


మాకవరపాలెం కస్తూర్బా పాఠశాలలో..

నర్సీపట్నం, జనవరి 26 : గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జయరాం జాతీయ పతాకాన్ని ఎగరవేసి పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ పూడి రవిబాబు జెండాను ఎగరవేశారు. అనంతరం మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు సబ్బులు, దుస్తులు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం.మహేశ్‌కుమార్, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ట్రెజరర్ పద్మనాభుని రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సచివాలయాల వద్ద గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎన్.జయమాధవి, డీఎల్‌డీవో, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అన్నాజీరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అన్ని సచివాలయాల వద్ద కార్యదర్శుల ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు.

నాతవరం : మండల కేంద్రం నాతవరంలో భారీ జాతీయ జెండా శుక్రవారం రెపరెపలాడింది. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్ఎస్ఎస్ సమకూర్చిన 75 అడుగుల జెండాతో అటవీ శాఖ మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో డేవిడ్‌రాజ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ ఆనంద్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ నారాయణరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏఎల్‌పురం, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, కొంగసింగి, విప్పలపాలెం తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అటవీ, పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ, పంచాయతీ తదితర కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణాదేవిపేట అటవీరేంజ్ అధికారి వెంకటరావు, డీఆర్‌వో రాజేష్, ఏఎస్ఐ నూకరాజు, సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, వైద్యాధికారులు గాయిత్రి, హరిప్రవీణ్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, సర్పంచ్ లోచల సుజాత, పందిరి సత్యనాయుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మాడుగులలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ రత్నం

మాకవరపాలెం : మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారిణి సీతామహాలక్ష్మి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రామకృష్ణారావు, మాకవరపాలెం హైస్కూల్‌లో ఎంఈవో మూర్తి, తామరం అవంతి కళాశాలలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు, భీమబోయినపాలెం కస్తూర్బా పాఠశాల వద్ద ప్రత్యేకాధికారిణి త్రివేణి, కొండలఅగ్రహారం ఇమ్మాన్యుయేలు కాలేజీలో ఆ సంస్థ అధినేత జీవన్‌రాయ్ జెండాను ఎగురవేశారు.

చోడవరం : గణతంత్ర దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ తిరుమలబాబు జెండాను ఆవిష్కరించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఎండీ వి.సన్యాసినాయుడు జెండా వందనం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు, పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద అధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : గణతంత్ర దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద జాతీయ జెండా రెపరెపలాడింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సువర్ణరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, ఎస్ఐ డి.ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు దొండా లలిత, గొంపా వెంకటేశ్వరరావు, స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుంకర శ్రీను, సూపరిండెంట్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరహాలు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సురేష్, కేజీబీవీలో ఎస్‌వో తులసీల జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మరిన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది.

రావికమతం : గణతంత్ర దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేశ్వరరావు, కొత్తకోట సర్కిల్ కార్యాలయంలో సీఐ అప్పలనాయుడు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకన్నబాబు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జి.ధనుంజయ నాయుడు, కొత్తకోట గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా పంచాయతీల కార్యదర్శులు జెండాను ఎగురవేశారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాడుగుల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పీవీ రత్నం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె వేడుక ప్రాముఖ్యతను వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక కేంద్రంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ పి.సత్యనారాయణ, అప్పారావు, ఎలక్షన్ ఆర్ఐ పూర్ణయ్యలతో పాటు పలువురు అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, జమ్మాదేవిపేట గ్రామ సచివాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కొశిరెడ్డి కృష్ణమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. ఎంపీడీవో, తహసీల్దార్, ట్రాన్స్‌కో కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ఆస్పత్రిలలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎస్ఐ నాగేంద్ర, వైద్యాధికారిణి పూజిత మేఘన, విద్యుత్ శాఖ ఏఈఈ శంకరరావు జెండాను ఎగుర వేయగా ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బీవీ రాణి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జయప్రకాశరావు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ బి.నారాయణరావు జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు, ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయా వైద్యాధికారులు జెండా వందనం చేశారు.

కె.కోటపాడు : గణతంత్ర దినోత్సవాన్ని మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం వద్ద రమేష్‌బాబు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ స్వామినాయుడు జెండాను ఎగురవేశారు. అలాగే, మరిన్ని కార్యాలయాలు, విద్యాలయాల్లో జెండాను ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : డిప్యూటీ సీఎం బూడి


వంతెన నిర్మాణానికి శంకుస్థాపనలో ముత్యాలనాయుడు

చీడికాడ, జనవరి 26 : మండల కేంద్రం చీడికాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా పలువురితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా పలు రోడ్ల పనులతో పాటు మర్లగుమ్మి కాలువపై నిర్మించే మినీ వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పేద రైతులకు డి.ఫారం పట్టాలను పంపిణీ చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, తహసీల్దార్ బీవీ రాణి, ఎంపీడీవో జయ ప్రకాశరావు, నీటిపారుదల శాఖ డీఈఈలు వేణు గోపాలనాయుడు, సత్యంనాయుడు, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజబాబు, పరవాడ మహేష్, గొల్లవిల్లి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కోళ్ల పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించాలి'


రైవాడలో బీవీరావు చిత్రపటం వద్ద రామారావు నివాళి

దేవరాపల్లి, జనవరి 26 : కోళ్ల పరిశ్రమను వ్యవసాయ స్థాయికి పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని భారతీయ కోళ్ల పరిశ్రమల సమన్వయ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు భర్నికాన రామారావు కోరారు. మండలంలోని రైవాడ శివారు బేత పూడిలో శుక్రవారం నిర్వహించిన భారతదేశ పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీరావు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. గుడ్డు పౌష్టికాహారంగా వివరించారు. అనంతరం తయారు చేసిన వివిధ రకాల వంటకాలను గ్రామస్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో భర్నికాన సాయినాథరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైద్యాధికారిణి పూజిత మేఘన, వైస్ ఎంపీపీ గంగాభవానీ, చల్లానాయుడు, తాతయ్యలు, నానాజీ, నరసింహమూర్తి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

తీర్థాల్లో కోడిపందేల జోరు!


ఒమ్మలి జగన్నాథపురం తీర్థంలో కోడిపందెం నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల, జనవరి 26 : గ్రామాల్లో కోడిపందేల జోరు సాగుతోంది. సంక్రాంతి నుంచి గ్రామ దేవతల తీర్థాలు జరుగుతూనే ఉంటాయి. ఈ వేడుకల్లో కోడి పందాలు, పేకాట, గుల్లాట తదితరాలు నిర్వహించరాదని పోలీసులు హెచ్చరిస్తున్నా చెవిన వేసుకునేవారు కరువయ్యారు. కొందరు కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేసిమరీ భారీగా బెట్టింగ్‌లు కాస్తున్నారని ప్రచారంలో ఉంది. మండలంలోని ఒమ్మలి జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ తీర్థంలో కోడిపందెం నిర్వహించారు. ఇందులో చాలమంది బెట్టింగ్‌లు కాస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్నారని అంటున్నారు. ఇదిలావుంటే, ఈ కోడిపందేనికి సంబంధించి చిత్రాలు వైరల్ కావడం విశేషం. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కోడిపందాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల జాతర


గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపులో భక్తులు

రోలుగుంట, జనవరి 26 : కొవ్వూరులో శుక్రవారం గౌరీపరమేశ్వరుల జాతర అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆది దంపతులను దర్శించుకున్నారు. ఐటీడీపీ మండల అధ్యక్షుడు బంటు రాజు, మాజీ సర్పంచ్ కోలిపల్లి ఈశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం అర్బన్, జనవరి 26 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడి వాసవి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత క్లబ్ అధ్యక్షుడు ఎం.మహేష్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం యాభై మంది రక్తాన్ని దానం చేశారు. క్లబ్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ట్రెజరర్ పద్మనాభుని రాయుడు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు' నిర్వాహకులపై బైండోవర్ కేసులు

మాకవరపాలెం, జనవరి 26 : మండలంలో ముప్పై మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ప్రసాదరావు ఎదుట హాజరు పర్చామన్నారు. ఆయన ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇదిలావుంటే, నర్సీపట్న సర్కిల్ పరిధిలోని కోటవురట్ల, నర్సీపట్నం, రోలుగుంట మండలాల్లో ఇప్పటివరకు 70మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

బుచ్చెయ్యపేట, జనవరి 26 : సీతయ్యపేట శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం బుచ్చెయ్యపేట పోలీసులు దాడి చేశారు. ముందస్తు సమాచారం మేరకు వెళ్లి పేకాట ఆడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3,810ల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

నర్సీపట్నం, జనవరి 26 : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలపై వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ డీవీవీ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ సీవీ నాగార్జున రెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఈ నెల 29, 30, 31, ఫిబ్రవరి ఒకటి తేదీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనదలచిన వారు పెదబొడ్డేపల్లి విద్యుత్ శాఖ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా ఆయన సూచించారు.

కె.కోటపాడు సీఐగా స్వామినాయుడు


సీఐ స్వామినాయుడు

కె.కోటపాడు, జనవరి 26 : కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా స్వామినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఎస్.తాతారావుకు విజిలెన్స్ డీఎస్పీగా పదోన్నతి రావడంతో విశాఖపట్నం వెళ్లారు. ఇదిలావుంటే, కొత్త సీఐను కె.కోటపాడు, దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ఎస్ఈబీ మాడుగుల సీఐగా ఈశ్వరరావు


ఎస్ఈబీ సీఐ ఈశ్వరరావు

మాడుగుల రూరల్, జనవరి 26 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మాడుగుల సీఐగా బి.ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాలూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారా, గంజాయి నియంత్రణకు ప్రత్యేకదృష్టి సారించనున్నట్టు చెప్పారు.

రాజాంలో అగ్ని ప్రమాదం : రూ.లక్ష ఆస్తినష్టం

బుచ్చెయ్యపేట, జనవరి 26 : మండలంలోని రాజాం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.లక్ష మేర ఆస్తినష్టం సంభవించింది. శుక్రవారం గ్రామానికి చెందిన మరిసా మేరీ, భర్త అశోక్‌కుమార్ ఇంటికి తాళాలు వేసి పనులపై బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానిక పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న అశోక్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన తాళాలు తీయడంతో ఇరుగు పొరుగువారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.20 వేల నగదు, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. సర్పంచ్ మరిసా నాని బాధిత కుటుంబానికి రూ.మూడు వేల నగదు, 25 కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కట్టుబట్టలతో మిగిలిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా బాధిత కుటుంబం కోరింది.